


## సైన్యానికి అండగా నిలుద్దాం..

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

అన్నపురెడ్డిపల్లి, మే 10 : భారత సైన్యానికి అండగా నిలుద్దామని ఎంఈవో ఆనంద్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని ఎర్రగుంట గ్రామంలో జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా భారత సైన్యానికి సంఘీభావంగా ర్యాలీ, మాక్‌డ్రిల్ నిర్వహించారు. జాతీయ జెండాలతో సైన్యానికి సంఘీభావంగా నినాదాలు చేశారు. వీరమరణం పొందిన సైనికుడు మురళీనాయక్‌కు నివాళులర్పించి, మౌనం పాటించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## జర్నలిస్టుల బైక్ ర్యాలీ

బైక్ ర్యాలీలో జర్నలిస్టులు

ఇల్లెందు, మే 10 : ఉగ్రదాడులను నిరసిస్తూ ఇల్లెందు జర్నలిస్టుల ఆధ్వర్యంలో శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఇల్లెందు పట్టణంలోని జగదాంబ సెంటర్‌లో సీఐ బత్తుల సత్యనారాయణ ర్యాలీని ప్రారంభించారు. జగదాంబ సెంటర్ నుంచి ఆమ్‌బజార్ మీదుగా గోవింద్ సెంటర్ నుంచి కరెంట్ ఆఫీస్ సెంటర్ వరకు భారత సైనికులకు మద్దతుగా నినాదాలు చేస్తూ ర్యాలీ కొనసాగింది.



అమర జవాన్ల ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటిస్తున్న ఉపాధిహామీ కూలీలు

## ఉపాధిహామీ కూలీల సంఘీభావం

కారేపల్లి, మే 10: ఉగ్రవాదాన్ని అణిచివేయడానికి 'ఆపరేషన్ సిందూర్' నిర్వహిస్తున్న భారత సైన్యానికి కారేపల్లి మండలం మాణిక్యారం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ కూలీలు సంఘీభావం తెలిపారు. శనివారం వారు పనిచేస్తున్న ప్రదేశం వద్ద జాతీయ జెండాలను చేతపట్టి నినాదాలు చేశారు. యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్లు మురళీనాయక్, సచిన్‌యాదవ్ వనంజేలకు నివాళులర్పించారు. వారి ఆత్మకు శాంతి కలుగాలని రెండు నిమిషాలు మౌనం పాటించి, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా యుద్ధంలో వీరోచితంగా పోరాడుతున్న వీరులను కన్న తల్లిదండ్రులకు పాదాభివందనాలు తెలియజేశారు. కార్యక్రమంలో మండల మేట్ల సంఘం అధ్యక్షుడు భూక్యా లక్ష్మణ్, చాగంటి వెంకటేశ్వర్లు(చిన్న), పోలేపల్లి రవి, భూక్యా కోటయ్య, రమేష్, ప్రసాద్, హర్షు, రాంబాబు, గణేష్, తరుణ్, అశోక్, సక్రు, వాల్యా, సైదా, వాచ్య, పాపా, కోటేశ్వరరావు, నాగయ్య, రామారావు, వెంకట్రామ్, జయమ్మ, కల్పన, కవిత, లక్ష్మి, పద్మ, రాధ పాల్గొన్నారు.

# విజయం మనదే..

- 'ఆపరేషన్ సిందూర్'కు మద్దతుగా ఉమ్మడి జిల్లాలో సంఘీభావ ర్యాలీలు
- జై భారత్.. జై జవాన్.. అంటూ హోరెత్తిన యువత నినాదాలు
- భారత జవాన్లకు శక్తియుక్తులను ప్రసాదించాలని పూజలు, హోమాలు
- యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్లకు ఘన నివాళులు

*'ఆపరేషన్ సిందూర్'తో పాకిస్థాన్ ఉగ్రమూకలను తుదముట్టించడమే లక్ష్యంగా దూసుకెళ్తున్న భారత సైన్యానికి యావత్ యువత సంఘీభావం ప్రకటించింది. పాక్ పన్నాగాలను, కుట్రలను తిప్పికొట్టే శక్తియుక్తులను మన సైన్యానికి ప్రసాదించాలని కోరుకుంది. శనివారం జాతీయ జెండాలు చేబూని జై భారత్.. జై జవాన్ అని నినాదాలు చేస్తూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బైక్ ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించారు. యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్లకు ఘన నివాళులు అర్పించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు.*




## త్రివిధ దళాల కృషి సక్సెస్ కావాలి



భద్రాచలం గోశాల వద్ద పూజలు చేస్తున్న ఈవో రమాదేవి, అర్చకులు

భద్రాచలం, మే 10 : భారత్‌లో శాంతిస్థాపనకు త్రివిధ దళాలు చేస్తున్న కృషి విజయవంతం కావాలని, దేశంలో ప్రజలు సుభిక్షంగా ఉండాలని భద్రాచలం దేవస్థానంలోని గోశాలలో ఈవో రమాదేవి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులతో కలిసి ప్రత్యేక హోమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాద దాడిని వ్యతిరేకిస్తూ చేస్తున్న 'సిందూర్ ఆపరేషన్' విజయవంతం కావాలని, భారతావని సుభిక్షంగా ఉండాలని భద్రాచల శ్రీరామచంద్రస్వామిని వేడుకున్నట్లు ఈవో తెలిపారు.



## 'పాకిస్థాన్-ఖబడ్దార్' గీతావిష్కరణ

అశ్వారావుపేట, మే 10 : భారత్‌పై పాకిస్థాన్ ఉగ్రదాడులకు పాల్పడిన నేపథ్యంలో రచించిన 'పాకిస్థాన్-ఖబడ్దార్' గీతాన్ని శనివారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. కొత్తగూడెం కళాకారుడు, కవి, సినీగేయ రచయిత, గాయకుడు డాక్టర్ మద్దెల శివకుమార్ స్వీయ రచనతోపాటు గానం చేసిన ఈ గీతాన్ని అశ్వారావుపేటలో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. భారతదేశ విపత్కర పరిస్థితుల్లో ప్రజలతోపాటు కవులు, కళాకారులు సంఘటితం కావాలని, పాక్ ఉగ్రవాదాన్ని తుద ముట్టించేందుకు ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.

గీతాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




ఖమ్మం నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్పొరేటర్లు

## ఖమ్మంలో కార్పొరేటర్ల ర్యాలీ

ఖమ్మం, మే 10 : భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'కు మద్దతుగా ఖమ్మం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహార, కార్పొరేటర్లు, ఉద్యోగులు నగరంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. నగర పాలక సంస్థ కార్యాలయం నుంచి ఆర్టీవో ఆఫీస్ మీదుగా బైపాస్ రోడ్డు వరకు జాతీయ జెండాలతో జై భారత్.. జై జవాన్ అని నినాదాలు చేస్తూ సైనికులకు సంఘీభావం తెలుపుతూ ప్రదర్శన నిర్వహించారు. అలాగే యుద్ధంలో వీరమరణం పొందిన ఆర్మీ జవాన్ మురళీనాయక్‌కు ఘన నివాళి అర్పించారు. మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ల ఒక నెల వేతనాన్ని భారత సైన్యం నిధికి విరాళంగా ప్రకటించారు. కార్యక్రమంలో కార్పొరేషన్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

# భానుడి భగ భగ

*ఎండలు మండిపోతున్నాయి. జనం తట్టుకోలేక బయటకు రాలేక ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒకవైపు పరిశ్రమలు ఎక్కువగా ఉండటం, మరోవైపు సింగరేణి బొగ్గుబావుల ప్రభావంతో ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతున్నాయి. కొన్నిరోజులుగా 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ శాఖ చూపెడుతున్నా.. భద్రాద్రి జిల్లాలో మాత్రం ఎక్కువగా నమోదవుతున్నట్లు తెలుస్తున్నది. ఉపాధి కూలీలు పనులు చేయలేక ఇంటిముఖం పడుతున్నారు. ఇక చిరువ్యాపారులు ఎండలకు జడిసి మధ్యాహ్నం వ్యాపారం బంద్ చేస్తున్నారు. పది గంటలు దాటితే ప్రజలు ఎండకు తట్టుకోలేక నీడను ఆశ్రయిస్తున్నారు. దప్పిక తీర్చుకోవడానికి చలివేంద్రాలకు పరుగులు పెడుతున్నారు. ఈసారి అధికారికంగా అధికారులు చలివేంద్రాలు ఏర్పాటు చేయక పోవడంతో శీతలపానీయాలను తాగి దప్పిక తీర్చుకుంటున్నారు.*

*- భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/ ఖమ్మం/కరకగూడెం, మే 10*

- ఉదయం పది నుంచే మండుతున్న ఎండలు
- ఇళ్లకే పరిమితమవుతున్న ప్రజలు
- వెలవెలబోతున్న వ్యాపారాలు



కొత్తగూడెంలో నిర్మానుష్యంగా ఉన్న రహదారి

ఇల్లెందు, కొత్తగూడెం, మణుగూరు, సత్తుపల్లి ఏరియాల్లో బొగ్గుబావుల ప్రభావం వల్ల ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతున్నాయి. దీంతో సింగరేణి కార్మికులు ఎండలకు తట్టుకోలేకపోతున్నారు. సెకండ్ షిఫ్టు చేసేవారు, మొదటి షిఫ్టు నుంచి ఇంటికి వచ్చేవారు ఎండలకు తట్టుకోలేక చెట్ల నీడను ఆశ్రయిస్తున్నారు. వడదెబ్బ తగులుతుందేమో అని కార్మికులు ఆందోళన చెందుతున్నారు. డ్యూటీల వద్ద మజ్జిగ ప్యాకెట్లను ఇస్తున్నప్పటికీ దాహం తీరడంలేదని కార్మికులు వాపోతున్నారు.

### వ్యాపారాలు వెలవెల..

అనేక వ్యాపారాలకు నిలయమైన ఖమ్మం నగరంలో భానుడి భగభగలకు ప్రజలు అల్లాడిపోతున్నారు. పగటిపూట ప్రజలంతా ఇళ్లకే పరిమితం కావడంతో వీధులన్నీ నిర్మానుష్యంగా మారి అప్రకటిత కర్ఫ్యూను తలపిస్తున్నాయి. దీంతో మధ్యాహ్నం సమయంలో వర్తక, వాణిజ్య వ్యాపారాలు గణనీయంగా పడిపోతున్నాయి. సాయంత్రం 6 గంటలు దాటితే తప్ప నగర జనం కాలు బయటపెట్టలేని చందంగా మారింది.

### పెరిగిన విద్యుత్ వినియోగం..

విద్యుత్ వినియోగం రోజురోజుకూ పెరిగిపోతున్నది. వేసవి ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు పేద, మధ్య తరగతి ప్రజలు కూలర్లను వినియోగిస్తుండగా ఉన్నత వర్గాలకు చెందిన వారు ఏసీలను వినియోగిస్తున్నారు. గతం కంటే కూలర్లు, ఎయిర్ కండీషన్ల వినియోగం పెరిగిపోవడంతో విద్యుత్ బిల్లులు తడిసిమోపెడవుతున్నాయి. అయినప్పటికీ ప్రజలు జంకకుండా విద్యుత్‌ను అధిక మొత్తంలో వినియోగిస్తున్నారు.

### వడదెబ్బ నివారణకు ముందస్తు చర్యలు..

శరీరం అధిక ఉష్ణోగ్రతకు గురైనప్పుడు శరీరంలో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. సాధారణంగా మన శరీరంలో జరిగే రసాయన చర్యల వల్ల వేడి ఉత్పత్తి అవుతుంది. అలా ఉత్పత్తి అయిన 'వేడి' మన శరీరంలోని 'ఉష్ణ సమతుల్యత'ను కాపాడే చర్మం ద్వారా చెమట రూపంలో బయటకు పంపబడుతుంది. కానీ.. మన శరీరం అధిక ఉష్ణోగ్రతకు కానీ, డీ హైడ్రేషన్‌కు కానీ గురైనప్పుడు రక్షణ మార్గాలైన చర్మం, ఊపిరితిత్తులు సరిగా పనిచేయవు. దానివల్ల మన శరీర ఉష్ణోగ్రత ఒక్కసారి అధిక స్థాయికి చేరుకుంటుంది. సాధారణంగా చిన్న పిల్లలు, అత్యధిక వయస్సు ఉన్న వృద్ధులు, క్రీడాకారులు, ఎక్కువగా ఆరుబయట పనిచేసే వారు వడదెబ్బకు గురవుతుంటారు.

### మూగజీవాలు విలవిల..

మనుషులకే ఇలా ఉంటే మూగజీవాల పరిస్థితి దారుణంగా ఉంది. బయట చెట్లనీడ లేక తాగునీరు దొరకక విలవిలలాడుతున్నాయి. అధికారులు ఏర్పాటు చేయాల్సిన నీళ్లతొట్లు లేకపోవడంతో తాగునీటికి మూగజీవులు అల్లాడిపోతున్నాయి. బయట మేతకు వెళ్లిన జీవాలకు నీరు దొరకక ఎండిపోయిన చెరువుల వద్దకు వెళ్లి బురద నీరు తాగే పరిస్థితి దాపురించింది. ఎండకు తట్టుకోలేక మేతకు వెళ్లిన జీవాలు అక్కడే మృత్యువాత పడుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు.



### జాగ్రత్తలు తీసుకోకుంటే ప్రమాదమే..



ప్రస్తుత సీజన్‌లో వాతావరణంలో విభిన్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఒకవైపు వర్షాలు, మరోవైపు ఎండలు మండిపోతున్నాయి. ముఖ్యంగా వివిధ రకాల జబ్బులతో బాధపడేవారు ఇటువంటి పరిస్థితుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. గుండె, డయాబెటిక్ రోగులు ఎండకు బయటకు రాకుండా జాగ్రత్తలు పాటించాలి. నీటితోపాటు రాగి జావ, పండ్లు ఎక్కువగా తీసుకోవాలి. ఎండకు లూజుగా ఉన్న దుస్తులు ధరించడం మంచిది. కార్మికులు పని ప్రదేశంలో నీడ ఉండేలా చూసుకోవాలి. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాం. వడదెబ్బ తగినట్లైతే వైద్యులను సంప్రదించి సలహాలు తీసుకోవాలి.

**–డాక్టర్ భాస్కర్‌నాయక్, డీఎంహెచ్‌వో, భద్రాద్రి జిల్లా**

# 'భట్టి' సభ మళ్లీ వెలవెల

- కేవలం గంటన్నరలోనే ముగిసిన సభ
- మొదటి నుంచే పూర్తిగా నిండని ప్రాంగణం



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రసంగిస్తుండగా ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

అశ్వారావుపేట, మే 10 : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సభ మళ్లీ వెలవెలబోయింది. గత ఏడాది అక్టోబర్ 13వ తేదీన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీలో పవర్ ప్లాంట్ ప్రారంభోత్సవం అనంతరం జరిగిన సభలో జనం లేక ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. అయినా భట్టి ప్రసంగం కొనసాగించారు. ఇదే ప్రాంగణంలో విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డితో కలిసి శనివారం 'భట్టి' శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. సభ ఉదయం 11 గంటలకు ప్రారంభంకావాల్సి ఉండగా.. డిప్యూటీ సీఎం సుమారు గంటకు పైగా ఆలస్యంగా వచ్చారు. ఎమ్మెల్యేలు, అధికారులు ప్రసంగించిన తర్వాత మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడిన అనంతరం డిప్యూటీ సీఎం భట్టి ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఈ సమయంలో సభా ప్రాంగణం సగం ఖాళీ అయ్యింది. సభ మొత్తం కేవలం గంటన్నరలో ముగిసింది. ఇందులో భట్టి సుమారు అరగంటపాటు ప్రసంగించారు. సభ ప్రారంభం నుంచీ ప్రాంగణం పూర్తిగా నిండలేదు.

### ఇద్దరు మంత్రులు గైర్హాజరు..

ఈ కార్యక్రమానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి గైర్హాజరయ్యారు. వీరిద్దరూ విద్యుత్ సబ్‌స్టేషన్ల శంకుస్థాపనలకు వస్తున్నారంటూ అధికార పార్టీ నాయకులు ప్రచారం చేశారు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు కూడా చేశారు. కానీ.. ఇద్దరు మంత్రులు హాజరుకాలేదు. తుమ్మల వర్గం నేతలు, ముఖ్య అనుచరులు కూడా కార్యక్రమానికి హాజరుకాకపోవడంతో పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి.

# మత్తులో యువత

- ఖమ్మం అర్బన్‌లో విచ్చలవిడిగా గంజాయి వాడకం
- పట్టించుకోని ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు

రఘునాథపాలెం, మే 10 : ఖమ్మం అర్బన్‌లో గంజాయి బూతం జడలు విప్పుతోంది. కొందరు విద్యార్థులు, యువకులు మద్యంతోపాటు గంజాయి, ఇతర డ్రగ్స్ మత్తులో జోగుతున్నారు. లక్ష్యంవైపు సాగుతూ చదువుపై దృష్టి సారించాల్సిన యువత తప్పటడుగులు వేస్తూ విలువైన జీవితాలను నాశనం చేసుకుంటోంది. గంజాయిని సేవించడం సరదాగా అటవాటు చేసుకొని మత్తులో కూరుకుపోతున్నది. గంజాయి మత్తుకు క్రమక్రమంగా అలవాటుపడిన విద్యార్థులు, యువకులు మాఫియా వలలో చిక్కుకొని విలవిలలాడుతున్నారు. ఒక్కసారి గంజాయి మత్తుకు అలవాటుపడి అందులో నుంచి బయట పడలేక కొందరు ఏజెంట్లుగా మారుతున్నారు. గంజాయికి డబ్బులేక దొంగతనాలు, ఇతర నేరాలకూ వెనుకాడటం లేదు. ఇంకొందరు పెద్దఎత్తున కమీషన్ రావడం, ఉచితంగా గంజాయి లభించడంతో స్మగ్లర్లుగా మారుతున్నారు. ఒత్తిడి నుంచి బయటపడేందుకు గంజాయి మత్తుకు కొందరు దాసోహం అవుతుండగా.. మరికొందరు ఫేస్ గ్లో పెరుగుతుందనే అపోహతో గంజాయికి బానిసలుగా మారుతున్నారు. ఖమ్మంఅర్బన్ పరిధిలో ఇటీవల కాలంలో గంజాయి వినియోగం ఎక్కువైందనే చెప్పవచ్చు. యువత, విద్యార్థులు గంజాయి మత్తుకు బానిసలుగా మారుతున్నట్లు టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ పోలీసు అధికారుల సోదాల్లో బయటపడింది. మద్యం మత్తులో ఇప్పటికే మునిగి తేలుతున్న యువత క్రమేపీ గంజాయి, కొకైన్ వంటి మత్తు పదార్థాలను వినియోగిస్తూ కొత్త మత్తుకు అలవాటు పడుతున్నట్లు తెలియవస్తున్నది. గంజాయి విరివిగా దొరుకుతుండటంతో యువతలో వినియోగం కూడా పెరిగిపోయింది.